# అయోధ్యరామయ్య ఆత్మకధ

నాపేరు అయోధ్యరామయ్య. పేరును బట్టి పెద్దవాణ్ణనీ, బొద్దుగావుంటాననీ అనుకోనేరు గనుక ప్రెస్‌రిపోర్టర్లకూడా తెలియని వ్యక్తిని. తెలిసివుంటే మీయెదుట వారీపాటికి నా ఫోటో ప్రదర్శించేవుందురు. అంచేత నారూపం నా మాటల్లోనే వెలిబుస్తూవున్నాను. పిల్లవాణ్ణీ పీలావాణ్ణీని!

మా తండ్రిగారు కడచిన యుద్ధపుదినాల్లో వైష్ణవం పుచ్చుకున్నారు. అనగా ముఖంమీద కూడ V గుర్తు కనబడేలా నామాలు పెట్టుకోవడం ప్రారంభించారు. ఆయనపేరు లక్ష్మయ్యగారు. ఆయన యొక్కయు, నాయొక్కయు, మా అమ్మయొక్కయు ఇంతెందుకు మా యింటిల్లిపాది వారి యొక్కయు ఇంటిపేరు 'ఆకాశ' వారు. కాని ఆకాశరామన్నకు మేము ఏమీ కామట. ఈ సంగతి అడిగినవారికి అల్లా ఘంటాపథంగా మా నాయనగారు చెబ్తూవుంటే వినలేక నా చెవులు తడకలు గట్టిపోయేవి. ఏమా అంటే రామన్నకు లక్ష్మన్న తమ్ముడు అని అన్నది వాల్మీకి నాటి నుంచి వస్తూవున్న వంశవృక్ష ప్రదీపిక. ఇలాగ్గా నాకు మా నాయన గార్ని ఎవరైనా ఉత్తరోత్రా తమ్మునిగా భావించి పోతారనో ఏమో కేవలం ఆకాశరామన్న అని అనకుండా "అయోధ్య రామయ్య" అని దూరదృష్టితో మా నాయనగారు నాకు నామకరణం చేసినట్టు కనిపిస్తుంది.

ఈనాపేరు పేపరుమీద నేను తొల్తగుండా నాకు నేనై వ్రాసికొన్నది నాలుగవ తరగతి ప్రవేశ పరీక్షకు కూర్చున్నప్పుడు ఇంకా మాస్టరుగారు ప్రశ్న చెప్పకుండాను ఏమీ వ్రాయమనకుండానే వ్రాసేసుకొన్నాను "ఆకాశ అయోధ్య రామయ్య—" అని ఏకాంతంగా. మరి ఆ పేరు వన్నెకెక్కింది "ప్యాసులిస్టు"లో నోటీసు బోర్డులో కనబడ్డప్పుడు.

నా జీవితంలో తొలిప్రజ్ఞ ఆనాటి విజయమే. మరి అంత క్రితం నాన్నముందు అమ్మముందు విద్దాలు చేయలేదా, వేసాలు వేయలేదా అంటే అవన్నీ వృత్తిత్తి సాంసారికాలు. వాటినిగురించి జ్ఞాపకశక్తి మనం వినియోగించ నవసరంలేదు. జ్ఞాపకశక్తికి ప్రారంభం అది అమల్లోకిరావడం బర్లోకి వెళ్లాకే. అంచేత అదే నాకు జ్ఞాపకంవున్న తొలి సంగతి. కాబట్టి ఆనాటి విజయమే నా ఆత్మకథకు నాంది. మరి పైసంగతులు నేను నాల్గోతరగతి గట్టెక్కాక మీకు తెలియజేస్తా వున్నాను. అందాకా దీనితోనే పాఠకులు తృప్తిపడి వుండవలసిందని చేతులెత్తి మ్రొక్కుతూ వున్నాను—విన్నారా? నేను పిల్లవాణ్ణీ పీలవాణ్ణీని!

నా తలమీద మా అమ్మ ఓ దొరటోపీ పెట్టి నన్ను ముస్తాబు చేసింది! దొరటోపీ ఎక్కడిదంటారేమో? మా నాన్న ఆ రోజున ఆఫీసుకు దాన్ని పెట్టుకు వెళ్ళడం మానేశాడు. ఎంచేత మాని వేశాడంటారేమో—మా నాన్నకు, మా అమ్మకు నన్ను ఆనాడు బరికి పరీక్షకు పంపడం విషయమై పెద్ద రభస జరిగింది. "అయ్యో! చదువులేక పిల్లవాడు పాడయిపోతున్నాడండీ! మీరాశ్రద్ధ పుచ్చుకోరు వాడిపట్ల. తోడి బాలుర్ని చూడండి! అట్టలట్టుకుని, కాగితాలట్టుకు, కలాలుచ్చుకొని ఏలా వెడుతున్నారో! వాళ్ళంతా వీడికంటె చిన్నవాళ్లు. మీకు వొక్క మాస్టరుగారి పరిచయంలేదు, ప్రమేయంలేదు, అస్తమానం ఆఫీసూ మీరూ! మీలా అఖరికి నౌఖరీ చేయడానికైనా ఓనాథం రావాలంటారా? అక్కరలేదంటారా? అని అడిగింది అమ్మ—తాను చేసేది నవుఖరీ అందే మా అమ్మని ఉగ్రుడై—ఇప్పటికీ ఆయన అప్పటి కళ్ల ఉరవు జేవురింపూ నాకు భయం గొల్పుతూ వున్నాయి. "నాది నవుఖరీ అన్నదానవు నీవేంకావాలి నాభార్యవు? ప్రాచీనపు అబిసీనియా బానిసవు! వర్తకపు రవాణా చలామణీ స్లేవు సరుకువు నువ్వు కావాలి!–ఇది నవుఖరీకాదు నేను చేసేది దద్దమ్మా! ఢణాధన్ ఏటమ్‌బాంబ్ విజయఘోష లాంటిది

నా హాములు. మరోమాటు ఇందాకటి కూత కూశావా నీ పెదవులు మణచేసి నోరు అణచేసేను కబడ్దార్ ” అంటూ నాడు హేట్ పెట్టుకోకుండా మా నాన్న ఆఫీసుకు రుసరుసలాడుతూ వెళ్ళి పోయినాడు.

మా అమ్మ జవాబు చెప్పకుండా ఆ హేట్ తీసి నానెత్తిమీద పెట్టి “ బరికి వెళ్ళునాయనా నీ అదృష్టం ” అని రెండు తెల్ల కాగితాలు ఒక పెన్సిలు ఇచ్చి స్వయంగా ఎదురై పంపించింది నన్ను. టోపీ ఉంచుకోవడంలో నా లోపలి తేజస్సు నాకే పైకి కనబడింది. అందులోంచి నా పిలక పైకి తొంగిచూడకుండా అట్టే నెట్టేసింది. చేయిచాపి మా అమ్మ గుమ్మంలోంచి నన్ను చూస్తూ—నాకో పిలక వుందిలేండి! అంది అప్పటికి ఇప్పటికి. ఎప్పటికి నాయొక్క ఏ ఫోటోలోనూ మీరు చూడకపోవచ్చును అందుచే వూహించుకొందురుగాక నా పూరారూపం. పిల్లవాణ్ణీ పిలవాణ్ణీ! పిలకున్నవాణ్ణీ! తిన్నగా బడికి వెళ్లాడు.

అడిగేస్తూవున్నారు అప్పటికప్పుడే ధూకుడుగా మాస్టరు గారు ప్రశ్నలు పిల్లవాళ్ళను కొందరు తెతైతై మెమ్మెమ్మె అంటూ వున్నారు. కొందరు తెల్లమొగాలేస్తూ వున్నారు. నన్నుకూడా వాళ్ల వరుసలో గూర్చుని జవాబులు వ్రాయమన్నారు. కొన్నికొన్ని చెప్పమన్నారు. మొత్తంమీద పరీక్ష తెనుగులోను, లెక్కల్లోను, ఇంగ్లీషులోను చేశారు. త్రిమూర్తుల్ని నా మ్రోల ప్రత్యక్షం గావల సినదని ప్రార్థనచేసినవాణ్ణయి ఉత్తరలేఖనం వ్రాయ దొరకొన్నాను. ఒకచోట పంతులుగారు 'ఈ పిలకలు' 'ఈ పిలకలు' అని చెబ్తూ వున్నారు. అదేదో కిత్తనారసంబంధపు పాఠము అనుకుంటాను. వెంటనే నా హేట్ నేలను పడేస్తూ “ పంతులుగారూ! పిలకన్నది వొక్కటే నాకున్నది!” అన్నాను. పంతులుగారు తమకో సహజ సరస్వతీ సధ్యః ప్రసన్నత అయినట్టు “ పిలకకు బహువచనం ... ” అంటూ “ఈ పిలకలు” అని మూడవసారికూడా

అన్నారు. నేనున్ను డుముపులు జ్ఞానం కలవానికిమల్లే నాపిల కెగరేశాను. పంతులుగారు "భేష్ చాలు; ఆమాత్రం లింగవచన భేదం తెలిసివుంటే చాలు" అని పిలక దువ్వుతూ పండ్రెండవ ఎక్కం వెయ్యమన్నారు. 12-12 వరకు అనిగాని 16-12 వరకు అని గాని బోర్డుమీద వ్రాయలేదు. నేను మరి అదేవేయ్యడం అదే వెయ్యడం. 1000-12-12000 దాకా 10,000-12-120000 దాకానే వేశానో నాకే జ్ఞాపకంలేదు సరిగదా మరి పంతులుగారు బోర్డుమీదవ్రాసిన యితర లెక్కల ప్రశ్నలు గమనించలేదు. ఆ వొక్క ఎక్కంతోటే నారెండు కాగితాలు పూర్తి అయిపోయి నాయి. పూర్తి అయిపోవడమే కాకుండా కొన్ని సున్నలు నేలమీద కూడా గియ్యవలసి వచ్చింది. పంతులుగారు చూచి కోపం తెచ్చుకోకుండా మందహాసంతో మాస్టరుగారి లోపం నవ్వేస్తే కప్పడిపోతుంది కామోసు "లెక్కల్లోకూడా ప్యాసయావు పిడుగా!" అన్నారు వీపుతట్టుతూ నేలమీద హేట్‌తీసి నా తల మీద పెడుతూ.

మరి నేనూ ఆ మాస్టరుగారూ కూడా ఇంగ్లీషు పరీక్షదగ్గరకు వచ్చాం. ఇక మాస్టరుగారు తతిమ్మా పిల్లకాయలను చూడనట్టు నావంకే చూస్తూ what is this? అని ఆయన ఎడంచెయ్యి ఆయన కుడిబుజంమీద చప్పుడయ్యేలా కొట్టుకొన్నారు; నాదృష్టి అటు తిరిగింది. నేను That is this! అని నా కుడిచెయ్యి గట్టిగా నా ఎడం భుజంమీద అస్ఫాలన గావించాను బలే ఫైన్మాన్‌లా! మాస్టరు గారు "ఉద్దండుడు వీడు!" అని అందరికి నన్ను చూపించారు. "ఫుల్‌ప్యాస్" అన్నారు నన్ను తట్టుతూ. నేను నా హేట్‌తీసి తలవంచాను పంతులుగారి ముందు.

ఇంతప్రజ్ఞ వెల్లడించి విజయవంతమైన కేరింతలతో నేనింటికి వెడితే–రాత్రి ఆ ప్యాసు అంతా మా నాన్న టోపీది అని మా అమ్మా, మా అమ్మ శకునాంది అని మా నాన్న "మిమ్మ ల్నిద్దర్నీ కూర్చోపెట్టవలసింది తెలిసొచ్చేది పరీచ్చ! ఓతట్టు అట్టుమాడ్చే ఎండ! ఓతట్టు మాస్టరుగా యక్ష ప్రశ్నలూ!" అని నేను, తుదకు కళ్ళనీళ్ల పర్యంతం వచ్చేశాం మేం ముగ్గురు.

... ... ... ... ...